6 కి.మీ. దూరానికి 26 కి.మీ. ప్రయాణం

- అమీన్‌పూర్‌కు రోడ్డు సౌకర్యం లేక ఇక్కట్లు
- రోడ్డు మరమ్మతు కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు

మండలకేంద్రానికి అది అతి సమీప గ్రామం.. కేవలం 6కి.మీ. దూరంలో మాత్రమే ఉంది. పూర్వకాలం నుంచి ఉన్న రోడ్డును ఎవరూ పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు 26కి.మీ. ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఊట్కూర్‌–అమీన్‌పూర్‌ రోడ్డు మరమ్మతు కోసం గ్రామస్తులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

– ఊట్కూర్‌

మండలంలోని అమీన్‌పూర్‌కు రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో దాదాపు 4,500మంది జనాభా, 2,600మంది ఓటర్లు ఉన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలతోపాటు మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో చుట్టూ తిరిగి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తున్నది. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలకు వచ్చే విద్యార్థులు, గ్రామస్తులు నారాయణపేట మీదుగా రావాల్సిన పరిస్థితి నెలకొన్నది. అమీన్‌పూర్‌ నుంచి ఊట్కూర్‌కు పాత రోడ్డుపై వెళ్తే కేవలం 6కి.మీ. దూరం మాత్రమే అవుతుంది. కొన్నేండ్లుగా రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో అధ్వానంగా మారింది. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి కంపచెట్లు పెరిగాయి. దీంతో ద్విచక్రవాహనదారులు పగిడిమారి, ఓబ్లాపూర్‌ మీదుగా మండలకేంద్రం వరకు 15కి.మీ. ప్రయాణిస్తుండగా, బస్సులో వెళ్లే వారు నారాయణపేట మీదుగా 26కి.మీ. ప్రయాణించాల్సి వస్తున్నది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఊట్కూర్‌–అమీన్‌పూర్‌ రోడ్డుకు మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఊట్కూర్‌–అమీన్‌పూర్‌ రోడ్డుపై పెరిగిన కంపచెట్లు

మరమ్మతు చేయాలి



ఊట్కూర్‌–అమీన్‌పూర్‌ రోడ్డుకు మరమ్మతు చేస్తే మండల కేంద్రానికి వెళ్లేందుకు దూరం దగ్గర అవుతుంది. బస్సులో నారాయణపేట మీదుగా 26కి.మీ. ప్రయాణించాల్సి వస్తుంది. చాలా సమయం వృథా అవుతుంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– చంద్రశేఖర్‌, ఉపసర్పంచ్‌, అమీన్‌పూర్‌

దూరం తగ్గుతుంది..



ఊట్కూర్‌–అమీన్‌పూర్‌ రోడ్డుకు మరమ్మతులు లేక మరుగునపడింది. రోడ్డుకు మరమ్మతు చేయించి రెండు కల్వర్టులు నిర్మిస్తే రాకపోకలు సాగించేందుకు సౌకర్యవంతంగా మారుతుంది. మండలకేంద్రానికి దూరం తగ్గుతుంది. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలి.

– హన్మంతు, అమీన్‌పూర్‌


క్లుప్తంగా

నాణ్యత లోపించొద్దు



కోస్గి: మండలంలోని చంద్రవంచ నుంచి కొత్తపల్లి మహేశ్వరం వరకు చేపట్టిన రోడ్డు పనుల్లో నాణ్యత పాటించి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మండల ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం రోడ్డు పనులను ప్రారంభించారు. వైస్‌ఎంపీపీ సాయిలు, పీఏసీఎస్‌ చైర్మన్‌ భీంరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ శ్యాసం రామకృష్ణ, ఎంపీటీసీ పోశప్ప, మ్యాకల రాజేష్‌, ఓంప్రకాష్‌ పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



నారాయణపేట టౌన్‌ : 'నిలువెత్తు నిర్లక్ష్యం' శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో విద్యుత్‌ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను మంగళవారం తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను అల్లుకుపోయిన తీగజాతి మొక్కలను ఏఈ మహ్మద్‌ రఫీ పరిశీలించి సిబ్బందితో తొలగింపజేశారు.

విద్యార్థులకు అభినందన

మాగనూర్‌: మండలంలోని పెగడబండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నిత్యవర్ధన్‌గౌడ్‌, రేఖ గురుకులానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఉపసర్పంచ్‌ రామకృష్ణారెడ్డి విద్యార్థులను శాలువా, పూలమాలతో సన్మానించి అభినందించారు. హెచ్‌ఎం నరేందర్‌, సింగిల్‌విండో డైరెక్టర్‌ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ కార్యాలయం తనిఖీ

ఊట్కూరు: స్థానిక తహసీల్దార్‌ కార్యాలయాన్ని మంగళవారం ఆర్డీఓ రాంచందర్‌ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా బదిలీ తదితర అంశాలకు సంబంధించిన వివరాలను తహసీల్దార్‌ తిరుపతయ్యతో తెలుసుకున్నారు. అంతకుముందు మల్లేపల్లి శివారులో రక్షిత కౌలుదారు భూములను ఆర్డీఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాఘవేందర్‌రెడ్డి, వీఆర్‌ఏలు రాజప్ప, భీంరావు, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

పోస్టర్‌ విడుదల

నారాయణపేట రూరల్‌ : పాత పెన్షన్‌ విధానం అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రథయాత్ర వాల్‌పోస్టర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలో సీపీఎస్‌ సంఘం నాయకులు విడుదల చేశారు. జిల్లాలోని సీపీఎస్‌ ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తి మద్దతు తెలియజేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, శేర్‌ కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, శంకర్‌, చైతన్య, అనంత్‌రెడ్డి, తిరుపతినాయక్‌, జహంగీర్‌, నర్సింహ, బాల రాజు, శ్రీనివాస్‌, అజీమ్‌, వెంకటేష్‌ పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కోస్గి: కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన వారు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ వినోద్‌ కోరారు. మండలంలోని పోలేపల్లి రైతువేదికలో మంగళవారం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఆధార్‌, పాస్‌పుస్తకం, నామినీ ఆధార్‌ జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అపూర్వ సమ్మేళనం

ధన్వాడ: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌ స్కూల్‌లో మంగళవారం 2015–16 బ్యాచ్‌ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ ఉమాదేవి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఊట్కూరు/మాగనూర్‌: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధూ కోరారు. మంగళవారం ఊట్కూరులో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్‌ అందజేయాలని తదితర సమస్యల పరిష్కారం కోసం విద్యాసంస్థల బంద్‌ చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో గోవర్ధన్‌రెడ్డి, శేఖర్‌, శివ, భరత్‌, అజయ్‌ ఉన్నారు. విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించాలని ఎస్‌ఎఫ్‌ఐ మాగనూర్‌ మండల అధ్యక్షుడు చిన్న నర్సింహ కోరారు.

హనుమాన్‌ చాలీసా పారాయణం చేయించాలి

నారాయణపేట టౌన్‌: ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల్లో విద్యార్థులచే హనుమాన్‌ చాలీసా పారాయణం చేయించాలని కోరుతూ మంగళవారం పట్టణ విశ్వహిందూ పరిషత్‌, భజరంగ్‌దళ్‌ ఆధ్వర్యంలో హెచ్‌ఎంలకు వినతిపత్రం అందజేశారు. చిన్నారుల్లో దేశభక్తి, దైవభక్తి పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ గౌరవాధ్యక్షుడు, భజరంగ్‌దళ్‌ పట్టణ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌, వెంకటేష్‌, నీరటి ఆకాశ్‌, అజయ్‌, నాగేశ్‌, మణిమోడి రవి, వీరేశ్‌ పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

ధన్వాడ: ఆషాడమాసం గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని కొండ్రోన్‌పల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆషాడమాసంలో గురుపౌర్ణమి సందర్భంగా శ్రీకృష్ణుడిని జగద్గురువుగా భావించి గురుపూజ చేయాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక కార్యవర్గ సభ్యుడు నాగ్యానాయక్‌ తెలిపారు. కార్యక్రమంలో తిరుపతయ్య, కిశోర్‌, విష్ణు, రాంరెడ్డి, వెంకటేశ్‌, అశోక్‌, శ్రీనివాస్‌, వివేక్‌, రాధిక, సాత్విక, లహరి పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ

మరికల్‌: మండలంలోని ఎలిగండ్ల, పస్పుల, మరికల్‌, రాకొండ గ్రామాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణాలకు మంగళవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. పంచాయతీ భవనాల పనులను త్వరగా పూర్తి చేయాలని సర్పంచులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్‌ సురేఖ, ఎంపీపీ శ్రీకళ, సర్పంచులు దేవమ్మ, గోవర్ధన్‌, మహదేవమ్మ, సుజాత, రాజు, నాయకులు కృష్ణారెడ్డి, బసంత, రాజవర్ధన్‌రెడ్డి, రాజేష్‌, హన్మిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

మరికల్‌: మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన ఇద్దరు వార్డుసభ్యులతో పాటు 30మంది ఇతర పార్టీల నాయకులు మంగళవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంపత్‌, భగవంత్‌రెడ్డి, రాంరెడ్డి, హన్మంతురెడ్డి పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మెటీరియల్‌ పంపిణీ



మెటీరియల్‌ పంపిణీ చేస్తున్న సీఆర్‌పీలు

నారాయణపేట రూరల్‌ : కలెక్టర్‌ శ్రీహర్ష ప్రత్యేక చొరవతో చేపట్టిన 45రోజుల విద్యాప్రణాళిక కార్యక్రమానికి సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పలు పాఠశాలల ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. మండలంలోని నాలుగు క్లస్టర్ల పరిధిలోగల పీఎస్‌, యూపీఎస్‌ హెచ్‌ఎంలు స్థానిక సింగర్‌బేస్‌ బుక్‌పాయింట్‌ నుంచి మెటీరియల్‌ను తీసుకెళ్లినట్లు సీఆర్‌పీలు తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్‌, గణితం సబ్జెక్టులపై విద్యార్థులు పట్టు సాధించేందుకుగానూ ప్రత్యేకంగా పుస్తకాలను రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు ఆరిఫ్‌, రవిప్రకాశ్‌, పవిత్ర, పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, రఘువీర్‌, విశ్వనాథ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

అన్ని అర్హతలు ఉన్నా మండలం చేయరా?

నారాయణపేట రూరల్‌ : అన్ని అర్హతలు ఉన్న కోటకొండను ఎందుకు మండలం చేయడంలేదో ప్రజలకు చెప్పాలని సీపీఐ (ఎంఎల్‌) ప్రజాపంథ రాష్ట్ర నాయకుడు హన్మేష్‌ డిమాండ్‌ చేశారు. మండలంలోని కోటకొండలో చేపట్టిన రిలే నిరాహారదీక్షకు మంగళవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం ఇటీవల ఎన్నో గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేశారని తెలిపారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే అన్ని అర్హతలు ఉన్న కోటకొండపై వివక్ష చూపుతున్నారని వాపోయారు. కోటకొండను వెంటనే మండలకేంద్రం చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌ ఫోన్‌లో మాట్లాడి దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌, చంద్రయ్య, చంద్రశేఖర్‌, అర్జున్‌రాజ్‌, గోవింద్‌, సాధన సమితి నాయకులు శ్రీనివాస్‌, రాము, యాదగిరి, కాశప్ప, చెన్నప్ప, సలీం, సర్పంచ్‌ విజయలక్ష్మి పాల్గొన్నారు.



దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న హన్మేష్‌

నేడు రౌండ్‌ టేబుల్‌ సమావేశం

కోటకొండ మండల సాధన కోసం చేపట్టిన పోరాటంలో భాగంగా బుధవారం ఉదయం 10గంటలకు స్థానిక మెట్రో ఫంక్షన్‌హాల్‌లో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహిస్తున్నట్లు సాధన సమితి నాయకులు తెలిపారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యావంతులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కొనసాగిన సమ్మె



జిల్లావ్యాప్తంగా మంగళవారం పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ మండల పరిషత్‌ కార్యాలయాల ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాల్లో పలు సంఘాల నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. జీఓనెం.60 ప్రకారం రూ.19,500 వేతనం ఇవ్వాలని, మల్టీపర్పస్‌ విధానం రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, పంచాయతీ ట్రాక్టర్లకు డ్రైవర్లను నియమించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్‌

పెండింగ్‌ బిల్లుల కోసం పోరు



మధ్యాహ్నభోజన పథకం కార్మికులకు పెండింగ్‌ బిల్లులు చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మండలాల్లో కార్మికులు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. జీఓనెం.8 ప్రకారం కనీస వేతనం ఇవ్వడంతోపాటు గుడ్ల చార్జీలు పెంచాలని కోరారు. కార్మికుల ఆందోళనకు పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్‌

పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలి

నారాయణపేట టౌన్‌: గ్రామాల్లో పశువులకు వైద్యం అందిస్తున్న పశుమిత్రలకు కనీసం వేతనం రూ.19వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్‌ పార్కు వద్ద మంగళవారం నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్‌ బాల్‌రాం మాట్లాడుతూ పశుమిత్రలకు పీఎఫ్‌, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పశుమిత్ర యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు సమీనా, చిట్టెమ్మ, అనురాధ, భువనేశ్వరి, సంతోష, లక్ష్మి, వెంకటమ్మ, మౌనిక, కుర్మమ్మ, మంజుల పాల్గొన్నారు.

సీఎంకు లేఖ

నారాయణపేట: జిల్లాకు రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలలను మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మెయిల్‌ ద్వారా లేఖ పంపినట్లు పాలమూరు పునర్నిర్మాణ ఫోరం అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. నారాయణపేట నియోజకవర్గంలో వందకుపైగా గిరిజన తండాలు ఉన్నాయని, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు రెండు ఆశ్రమ పాఠశాలలను మంజూరు చేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి కూడా లేఖ పంపినట్లు తెలిపారు.

రైతులకు క్షమాపణ చెప్పాలి



నారాయణపేటలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

నారాయణపేట: వ్యవసాయానికి సరఫరా చేస్తున్న ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్‌, నియోజకవర్గ యూత్‌ విభాగం అధ్యక్షుడు శ్రీపాద కులకర్ణి మాట్లాడుతూ రైతులకు మూడు గంటల విద్యుత్‌ సరిపోతుందని, సీఎం కేసీఆర్‌ అనవసరంగా 24 గంటలపాటు ఉచిత విద్యుత్‌ ఇస్తున్నారని రేవంత్‌రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. రైతులకు భేషరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు గందె చంద్రకాంత్‌, ప్రతాప్‌రెడ్డి, చెన్నారెడ్డి, శ్రీపాద్‌, కార్తీక్‌, బండి శివరాంరెడ్డి, వెంకట్రాములు, వినోద్‌, సురేంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, పళ్ల వెంకట్రాములు పాల్గొన్నారు.

ధన్వాడ: బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులకు మూడు గంటల కరెంటు సరిపోతుందని మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యూత్‌ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, చంద్రశేఖర్‌, పటేల్‌ నర్సింహులు, సుదీర్‌కుమార్‌, సచిన్‌, శివారెడ్డి, సత్యనారాయణ, వీరేశ్‌ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



నాగిరెడ్డిపల్లిలో..

మక్తల్‌: మండలంలోని వల్లభాపురం దత్తక్షేత్రంలో మంగళవారం రేణుకామాత బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకామాతకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ వనజ, సర్పంచ్‌ దత్తు పాల్గొన్నారు.

మద్దూర్‌: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో మంగళవారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల విన్యాసం ఆకట్టుకున్నది.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

నారాయణపేట టౌన్‌: పట్టణంలోని దామరగిద్ద రోడ్డులో కొలువుదీరిన మహాపురే ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం స్వకుళ సాలి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకం, అలంకరణ నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పరిమళాపురంలోని పొల్కమ్మ ఆలయంలో దూల్‌పేట ఎస్‌ఎస్‌కే సమాజ్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నర్వ: మండలంలోని యాంకిలో పోలేరమ్మ బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరచెరువు గట్టుపై వెలిసిన పోలేరమ్మకు గ్రామస్తులు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

ధన్వాడ: మండల కేంద్రంలో మంగళవారం ఎల్లమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా కట్టమీది ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



ధన్వాడలోఎల్లమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు



ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పుస్తకపఠనంతో మేధోసంపత్తి



విద్యార్థులతో పుస్తకపఠనం చేయిస్తున్న ఎంఈఓ

మక్తల్‌: పుస్తకపఠనంతో మేధోసంపత్తి పెంపొందుతుందని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తకపఠనం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్‌, శ్రీనివాసరావు, రవీందర్‌, సిఆర్పీ సునీత పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

మక్తల్‌: మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక 16వ వార్డులో ఎస్‌డీఎఫ్‌ నిధులు రూ.30లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మక్తల్‌ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ఎస్‌డీఎఫ్‌ నిధులు రూ.2కోట్ల 50లక్షలు, మరో రూ.కోటి 95లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 4, 7, 10, 16 వార్డుల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.కోటి 40లక్షలు మంజూరైనట్లు చెప్పారు. మక్తల్‌లో త్వరలోనే 150 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం బీరప్ప ఆలయం వద్ద కమ్యూనిటీహాల్‌ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాగనూర్‌ పీఏసీఎస్‌ చైర్మన్‌ వెంకట్‌రెడ్డి, మత్స్యసహకార సంఘం జిల్లా చైర్మన్‌ కోళ్ల వెంకటేశ్‌, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, గాల్‌రెడ్డి, ఎండీ సలాం, హన్మంతు, రవిశంకర్‌రెడ్డి, నాగరాజు, కుర్వలింగం, యల్లాంగప్ప, జగదీశ్‌, సుభాష్‌, జయానంద్‌, ఏఈ నాగశివ, కావలి శ్రీహరి, శేఖర్‌రెడ్డి, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.



16వ వార్డులో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఎక్లాస్‌పూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి..

మరికల్‌: నియోజకవర్గంలో అన్నివిధాలా అభివృద్ధి చెందిన ఎక్లాస్‌పూర్‌ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గతంలో ఎక్లాస్‌పూర్‌ అభివృద్ధికి రూ.51లక్షలు మంజూరు కాగా, ప్రస్తుతం రూ.30లక్షలు కేటాయించినట్లు తెలిపారు. పల్లెల రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీకళ, సర్పంచ్‌ పద్మమ్మ, చింతలయ్య, రాజవర్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, యశోదమ్మ, నరేందర్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

కోస్గి: ప్రజాసంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. హాత్‌ సే హాత్‌ జోడో పాదయాత్రలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతుందని, కేసీఆర్‌ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌, రాములు, విజయకుమార్‌, రఘువర్ధన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, భానునాయక్‌, ఇద్రీస్‌ పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన ర్యాలీ



మక్తల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మక్తల్‌: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ నియంత్రణపై మంగళవారం మక్తల్‌ పట్టణంలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అందరూ కుటుంబ నియంత్రణ పాటించి సంతోషకరమైన జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు తిరుపతి, నరేందర్‌, మల్లికార్జున్‌, సులోచన, సుజాత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరుగుదలపై కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో శివకుమార్‌, మహేష్‌, నాగేష్‌, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్‌: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుటుంబ నియంత్రణపై అందరికీ అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

కోస్గి: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్దూర్‌, గుండుమాల్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మీర్జాపూర్‌ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు దేశ జనాభాపై నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకున్నది. డాక్టర్‌ కిష్టమ్మ, జీహెచ్‌ఎం అనంతప్ప, వైద్యసిబ్బంది సౌందర్య, గాయత్రి, లక్ష్మి, నర్సమ్మ, రాంచందర్‌జీ, నర్సింహారెడ్డి, హరికారెడ్డి, మణిమాల, రవికుమార్‌ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ సూర్యప్రకాశ్‌రెడ్డి, డాక్టర్లు అబీబ్‌, స్రవంతి, సిబ్బంది విజయ్‌కుమార్‌, మణిమాల, నర్సింహులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్‌ మునీర్‌ అహ్మద్‌, సూపర్‌వైజర్‌ కథలప్ప పాల్గొన్నారు.